జగన్‌కు జనాదరణను ఓర్వలేకే కుయుక్తులు

• ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి


మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, జంకె వెంకటరెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉదయగిరి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న జనాదరణను చూసి ఓర్వలేక కూటమి ప్రభుత్వం ఆయన్ని ప్రజల్లో తిరగనీయకుండా చేయడానికి కుయుక్తులు పన్నుతోందని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని మేకపాటి నివాసంలో ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. కులమతాలు, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను తెచ్చుకుందన్నారు. ఆ వ్యతిరేకత రోజురోజుకు పెరుగుతోందన్నారు. అందుకే ప్రజల్లో జగన్‌మోహన్‌రెడ్డికి విశేష ఆదరణ వస్తోందన్నారు. దీన్ని చూసిన కూటమి ప్రభుత్వం ప్రజల్లోకి రానీయకుండా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి త్వరలోనే మండల, గ్రామ కమిటీలను పూర్తి చేస్తామన్నారు. ప్రతి గ్రామానికి వచ్చి కార్యకర్తలను నేరుగా కలుస్తామన్నారు. నియోజకవర్గ, మండల, గ్రామస్థాయిలో నిర్వహించే 'రీకాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టో' కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, చంద్రబాబు అసత్య వాగ్దానాలకు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. ఏ కార్యకర్తకు సమస్య వచ్చినా కలిసి కట్టుగా ఎదుర్కొందామన్నారు. నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల్లోకి వెళితే తమ ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందనే భయంతోనే కూటమి ప్రభుత్వ పెద్దలు ఆయన పర్యటనలకు అనేక సాకులు చూపుతూ అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. జగన్ ప్రజల్లోకి వెళ్లడంతోనే సీఎం చంద్రబాబు తల్లివందనం నగదును జమచేశారన్నారు. అందులోనూ రూ. 2వేలు చొప్పున కోత పెట్టారన్నారు. ఆ నగదు ఎవరి ఖాతాల్లోకి వెళుతుందో తెలియడం లేదన్నారు. జమిలీ ఎన్నికలు వచ్చినా, 2029 ఎన్నికల్లో అయినా జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడానికి అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నీతి, నిజాయతీలకు కట్టుబడి ఉండే మేకపాటి కుటుంబంతోనే ఉదయగిరి ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ ఆలీఅహ్మద్, వింజమూరు, ఉదయగిరి జెడ్పీటీసీ సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, మోడి రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు కాటం రవీంద్రారెడ్డి, దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, చిమ్మిలి రవీంద్ర, మందలపు తిరుపతి నాయుడు, ఇస్కా మదన్‌మహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహిద్దాం

కావలి (జలదంకి) : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను కావలి నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించి సేవా కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. కావలిలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద ఉదయం 9 గంటలకు వైఎస్సార్ జయంతి వేడుకలు ప్రారంభం అవుతాయన్నారు. వైఎస్సార్‌సీపీ కుటుంబసభ్యుల భారీగా తరలిరావాలని కోరారు.

ఉదయగిరి: దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను ఉదయగిరి నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించాలని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పార్టీ శ్రేణులకు సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయగిరిలో జరిగే వైఎస్సార్ జయంతి వేడుకలకు మండలంలోని ముఖ్యనాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

• వింజమూరులో మంగళవారం జరిగే దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ రేవుమూరు శ్రీనివాసులురెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

వరికుంటపాడు : వరికుంటపాడు మండలంలో మంగళవారం జరిగే వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ మందలపు తిరుపతినాయుడు సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

ఏఎస్‌పేట దర్గాకు పోటెత్తిన భక్తులు


క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు


తప్పిపోయిన చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని ఖాజానాయబ్ రసూల్ దర్గాకు భక్తులు సోమవారం పోటెత్తారు. నెల్లూరులోని బారాషహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండగకు వచ్చిన భక్తులు ఏఎస్‌పేట దర్గాను దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున తరలిరావడంతో కోలాహలం నెలకొంది. పోలీసులు ప్రత్యేకంగా క్యూలైన్‌లను ఏర్పాటు చేయడంతో భక్తులు ప్రశాంతంగా అబ్బాజాన్, అమ్మాజాన్‌ల సమాధులను దర్శించుకున్నారు. దర్గా ఈఓ హుస్సేన్ భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పించారు. కాగా దర్గాకు భక్తులు పోటెత్తడంతో చిన్నపిల్లలు తప్పిపోగా పోలీసులు వారిని పట్టుకునేందుకు దాదాపు రెండు గంటల పాటు శ్రమించారు. చిత్తూరు జిల్లాకు చెందిన ఏడాది పాపతో పాటు హైదరాబాద్, మహబూబ్‌నగర్‌కు చెందిన ఇద్దరు పాపలు తప్పిపోగా పోలీసులు పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు.

క్లుప్తంగా

నేడు బీఎల్వోలకు శిక్షణా తరగతులు

కొండాపురం: మండలంలోని బూత్‌లెవల్ అధికారులకు మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎల్వోలు శిక్షణా కార్యక్రమానికి తప్పకుండా హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలు

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాకలోని రుక్మిణీసత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను మంగళవారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మేకల శ్రీనాథ్‌రెడ్డి సోమవారం తెలిపారు. 8న అంకురార్పణ, ధ్వజారోహణం, 9న శేష వాహనోత్సవం, హనుమంతసేవ, 10న మోహినీ అలంకారం, గరుడసేవ, 11న గజ వాహనోత్సవం, సాయంత్రం కల్యాణోత్సవం, 12న అశ్వ వాహనోత్సవం, రథోత్సవం,13న 108 కలశాలతో అభిషేకం, చక్రస్నానం, పుష్పయాగం, ఏకాంతసేవ నిర్వహించనున్నట్లు వివరించారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా అప్పాజీ



సీతారామపురం : మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఉదయగిరి ఎంపీడీఓ అప్పాజీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న భార్గవిరెడ్డి బాపట్ల ఈటీసీ కేంద్రానికి బదిలీ కావడంతో ఆమె రిలీవ్ అయ్యారు.

సన్మానం



సీతారామపురం: మండల ఎంపీడీఓ(ఎఫ్ఏసీ) గా పనిచేస్తూ బాపట్ల ఈటీసీ కేంద్రానికి బదిలీ అయిన డిప్యూటీ ఎంపీడీఓ భార్గవిరెడ్డిని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. మండల ఈఓపీఆర్డీగా, ఎంపీడీఓగా ఆమె అందించిన సేవలను కొనియాడారు. సీతారామపురం సర్పంచ్ కే భాగ్యమ్మ, మాజీ వైస్‌ఎంపీపీ రామిశెట్టి తిరుపతయ్య, నెమళ్లదిన్నె సర్పంచ్ రామచంద్ర, ఇన్‌చార్జి ఎంపీడీఓ అప్పాజీ, ఎంఈఓ మస్తాన్‌వలీ, వైద్యాధికారిణి స్వప్నారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కిలో పొగాకు సగటు ధర రూ.225

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకుకు సగటు ధర రూ.225 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు వేలానికి 389 బేళ్లను తీసుకురాగా, 332 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.160, సగటున రూ.225.23 ధర లభించిందని వివరించారు.

వ్యక్తిపై దాడి

అనుమసముద్రంపేట: తనపై కొందరు దాడికి పాల్పడ్డారని కావలియడవల్లి గ్రామానికి చెందిన పీ కళ్యాణ్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు.. గ్రామంలోని హైస్కూల్‌లో క్రికెట్ ఆడే సమయంలో పీ కళ్యాణ్, కలికిరి బాలాజీ మధ్యన చిన్నపాటి గొడవ చోటు చేసుకుంది అనంతరం బాలాజీ ఇంటికి వెళ్లి తల్లిదండ్రులు, మేనమామలకు విషయాన్ని తెలియజేశారు. ఈ క్రమంలో శ్రీనివాసులు, జల్లి రామకృష్ణ వచ్చి తనపై దాడి చేసి గాయపరిచారని కళ్యాణ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దెబ్బతిన్న సీసీరోడ్ల పరిశీలన

ఉదయగిరి: పట్టణంలోని దిలావర్‌బాయి వీధి, బ్రాహ్మణవీధి, వాల్మీకివీధి, యాదవపాళెం, నాగులబావి వీధుల్లో దెబ్బతిన్న సిమెంట్‌రోడ్లను పంచాయతీరాజ్ డీఈఈ మణికుమార్, ఏఈ శ్రీనివాసరాజు సోమవారం పరిశీలించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు నూతనంగా సీసీ రోడ్ల నిర్మాణానికి నిర్మాణానికి కొలతలు సేకరిస్తున్నామని, నిధులు మంజూరైన వెంటనే నిర్మాణ పనులు చేపడుతామని వారు తెలిపారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఆత్మకూరు: నారంపేట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ బదిలీపై చెర్లోయడవల్లి పాఠశాలకు వెళ్లిన నరేంద్రరెడ్డిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుడిగా అందించిన సేవలను కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల శ్రీహరినాయుడు, ఉపాధ్యాయులు టీ సురేష్, వెంకటేశ్వర్లురెడ్డి, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, శివరామిరెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, అంగన్‌వాడీలు లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం


జలదంకిలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు


సీతారామపురంలో..


అల్లూరులో..

జలదంకి/సీతారామపురం/దుత్తలూరు/అల్లూరు: జలదంకిలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ మాదిగలు ఐక్యతతో హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ సామాజిక న్యాయ సాధన కోసం కృషి చేస్తుందన్నారు. ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్, ఎమ్మార్పీఎస్ నాయకులు చెరుకూరి వెంకటేశ్వర్లు, సూరిపోగు అరుణ్, మహేంద్ర, శ్యామ్‌సన్, సతీష్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సీతారామపురం మండలం సోంపల్లిలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు నేలటూరి జాషువా, డాక్టర్ కలివెల ఎలీషాకుమార్, ఎంఈఎఫ్ నాయకులు ఏవీ రమణయ్య, సహదేవ్, గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు. అలాగే దుత్తలూరు మండలం సోమలరేగడలో ఎంఎస్పీ నాయకుడు ఆర్ల వినోద్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ గొల్లపల్లి మోహన్‌రావు, సింహాద్రి, అర్జున్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు. అలాగే అల్లూరులోని అరుంధతీయవాడలో పట్టణ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కోటయ్య మాదిగ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు.

ఉదయగిరి కోట సందర్శన

ఉదయగిరి: ఉదయగిరి కోటను భారత నౌకాదళ కమిటీ సోమవారం సందర్శించింది. ఉదయగిరి సర్పంచ్ పాములూరు సామ్రాజ్యం, ఉపసర్పంచ్ ముర్తుజా హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి షేక్ కరిముల్లాను అడిగి ఉదయగిరికి సంబంధించిన చరిత్రను తెలుసుకున్నారు.

సార్వత్రిక సమ్మె జయప్రదానికి పిలుపు

కావలి (జలదంకి): దేశవ్యాప్తంగా ఈ నెల 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు కోరారు. కావలిలోని సీపీఎం కార్యాలయంలో పట్టణ విస్తృత స్థాయి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తాళ్లూరి మాల్యాద్రి మాట్లాడుతూ భారతదేశంలో పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టడంతో పాటు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఎం మండలాధ్యక్షుడు సీతారామయ్య, కేవీపీఎస్ జిల్లా కమిటీ అధ్యక్షుడు కే జాన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరించాలి

కొండాపురం: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ కోటేశ్వరరావు, ఎంపీడీఓ ఆదినారాయణ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వారు పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. గ్రీవెన్స్‌కు మూడు అర్జీలు వచ్చినట్టు వారు తెలిపారు. ఏపీఎం కాంతారావు, ఏపీఓ మురళి, మండల పరిషత్ ఏఓ శేషసాయి పాల్గొన్నారు.

దివ్యాంగుడికి వైద్యుల చేయూత


సదరం క్యాంపునకు స్టూళ్లపై వచ్చిన దివ్యాంగుడు


వైద్యులు అందజేసిన వాకర్‌తో..

ఆత్మకూరు: ప్రమాదవశాత్తు కాలు కోల్పోయిన ఓ దివ్యాంగుడికి ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాల వైద్యులు చేయూతనందించారు. వివరాలు..బుచ్చిరెడ్డిపాళెం మండలం కొట్టాలు గ్రామానికి చెందిన వెంకటరమణయ్య గత కొన్నేళ్ల క్రితం ప్రమాదవశాత్తు ఎడమ కాలు కోల్పోయాడు. అప్పట్నుంచి చిన్న ప్లాస్టిక్ స్టూళ్ల ఆధారంగా నడక సాగిస్తున్నాడు. సోమవారం ఆయన ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన సదరం క్యాంపునకు రాగా గమనించిన ఫిజియోథెరపిస్ట్ చంద్రశేఖర్ సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం దృష్టికి తీసుకెళ్లారు. వెంకటరమణయ్య పరిస్థితిని స్వయంగా పరిశీలించిన సూపరింటెండెంట్ సులభంగా నడిచేందుకు వీలుగా వాకర్‌ను అందజేశారు. అతను ప్రైవేట్ అనాథ ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న విషయాన్ని తెలుసుకుని నెల్లూరులో ప్రభుత్వం నిర్వహిస్తున్న అనాథ ఆశ్రమానికి ఫోన్ చేసి అక్కడ ఆశ్రయం కల్పించాలని సూచించారు. తన పరిస్థితి చూసి స్పందించిన వైద్యులకు వెంకటరమణయ్య కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో గేదెలు మృతి

దుత్తలూరు: విద్యుత్ షాక్‌తో రెండు గేదెలు మృతి చెందిన ఘటన కమ్మవారిపాళెంలో చోటు చేసుకుంది. వివరాలు..కమ్మవారిపాళేనికి చెందిన నూతేటి రామకృష్ణ, నూతేటి ఓబయ్యలు రోజూ మాదిరిగా ఆదివారం గేదెలను మేత కోసం పొలాల్లోకి వదిలారు. సాయంత్రం గేదెలు ఇంటికి తిరిగి రాకపోవడంతో వాటి కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో గ్రామ సమీపంలోని పొలాల్లో 11కేవీ విద్యుత్ తీగ తెగిపడి గేదెలు మృతిచెంది ఉండడాన్ని గుర్తించి వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందజేశారు. కుటుంబ జీవనాధారమైన రూ.1.60 లక్షల విలువైన గేదెలు మృత్యువాతపడడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

14 నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

దుత్తలూరు: మండలంలోని గిరిజనుల కోసం ఈ నెల 14 నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులను నిర్వహించనున్నట్లు డిప్యూటీ ఎంపీడీఓ మల్లికార్జున తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ లేని గిరిజనులను గుర్తించి ప్రత్యేక క్యాంపుల్లో ఎన్‌రోల్‌మెంట్ చేయించాలని సూచించారు. గ్రామాల్లోని ఇంటింటి చెత్తసేకరణను పక్కాగా చేపట్టాలన్నారు. ఈ నెల 9న పంచాయతీల అభివృద్ధిపై నిర్వహించనున్న సమావేశానికి తగిన ప్రణాళికలను సిద్ధం చేసుకుని రావాలని సూచించారు.

పూరిల్లు దగ్ధం



సోమశిల: అనంతసాగరం మండలం ఉప్పలపాడులో ప్రమాదవశాత్తు పూరిల్లు దగ్ధమైన ఘటన సోమవారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన షేక్ ఆషాబీ పూరింట్లో నివాసం ఉంటోంది. పీర్ల ఊరేగింపు సందర్భంగా బాణసంచా కాల్చుతుండగా ప్రమాదవశాత్తు పూరింటి మీద పడడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు మంటలను అదుపు చేసేలోగానే అల్లు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఇంట్లోని వస్తువులతో పాటు ఆషాబీ కుమారుడికి చెందిన ట్రాక్టర్ పరికరాలు కాలిపోయాయి. సుమారు రూ.2లక్షల మేర నష్టం వాటిల్లినట్లుగా బాధితులు సోమశిల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నిషేధాజ్ఞలను ఉల్లంఘించి చేపల వేట

సోమశిల: ఈ నెల 1వ తేదీ నుంచి సోమశిల జలాశయంలో చేపల వేటను నిషేధిస్తూ మత్స్యశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ కొందరు జాలర్లు మత్స్యశాఖ నిషేధాజ్ఞలను ఉల్లంఘిస్తూ వేట సాగిస్తున్నారు. మధ్యాహ్నం వేళ అధికారుల కళ్లుగప్పి జలాశయంలోకి వెళ్లి చేపల వేట చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి నెలకొందని గ్రామస్తులు అంటున్నారు. మత్స్యశాఖ సిబ్బందితో నిఘాను ఏర్పాటు చేస్తే జాలర్లు నిబంధనలు మీరే అవకాశం ఉండదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా మత్స్యశాఖ అధికారులు స్పందించి జలాశయంలో చేపల వేట చేపట్టకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

